కంకర పరిచి.. తారు మరిచి

- రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

బయ్యారం: తారు రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి రోజులు గడుస్తున్నా పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించి వాహనదారుల ఇబ్బందులను తొలగించాల్సిన సంబంధిత అధికారులు సైతం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

బయ్యారం మండల కేంద్రం నుంచి ముత్యాలమ్మ గూడెం వెళ్లే రహదారిపై 5.9 కిలోమీటర్ల వరకు సుమారు రూ.11కోట్ల నిధులతో రెండు వరుసల రహదారిని నిర్మించేందుకు అప్పటి మంత్రి సత్యవతిరాథోడ్ 2023 జూలైలో పనులు ప్రారంభించారు. అయితే బయ్యారం మండల కేంద్రంలో ఇప్పటి వరకు రహదారి పనులు ప్రారంభించకపోగా మండల కేంద్రం చివరి నుంచి చోక్లాతండా వరకు కంకర



కంకర పోసి వదిలేసిన బయ్యారం–చోక్లాతండా రహదారి

పనులు పూర్తి చేసి బీటీ పోయడం నిలిపివేశారు. పనులు ప్రారంభించి 18నెలలు గడిచినప్పటికీ పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తారు వేయడం మరిచారు..

మండల కేంద్రం చివరి నుంచి చోక్లాతండా వరకు గతంలో ఒక వరుస బీటీ రహదారి ఉండేది. కొత్త రహదారి నిర్మాణం నిమిత్తం పాత రహదారిని తొలగించిన కాంట్రాక్టర్ కంకరను పోసి తారు పోయడం లేదు. దీంతో నిత్యం ఈ రహదారిపై నుంచి మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగించే వెంకట్రాంపురం, ఉప్పలపాడు, సర్నాతండా, గౌరారం, గురిమెళ్ల, బాలాజీపేట, బాల్యాతండా పంచాయతీల పరిధిలోని పలుగ్రామాల వాసులు నెలల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈవిషయంపై సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవటం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారి పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో తారు పోయిస్తాం

బయ్యారం–చోక్లాతండా రహదారిపై రెండు రోజుల్లో తారు పోయిస్తాం. ఇప్పటికే ఈ విషయంపై సంబంధిత కాంట్రాక్టర్ పై ఒత్తిడి తెస్తున్నాం. వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గ్రహించి వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసురంటున్నాం.

– అనిల్, ఆర్అండ్‌బీ ఏఈ

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు



మాట్లాడుతున్న దుడ్డెల రామ్మూర్తి

నెహ్రూసెంటర్: కుల వివక్ష, అంటరానితనాన్ని రూపు మాపడానికి ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సన్నద్ధం కావాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వివక్షను రూపుమాపడం కోసం పూలే, అంబేడ్కర్ ఆలోచన విధానంలో నడవాలని పిలుపునిచ్చారు. నేడు జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, సదస్సుకు సంఘం రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్‌బాబు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యనమల కిరణ్, చీపిరి యాకయ్య, బేతమల్ల విజయలక్ష్మీ, మచ్చ వెంకన్న, మట్టి నరేష్, నూనే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ డీఏ చెల్లించాలి

తొర్రూరు: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకరాచారి మాట్లాడుతూ.. డీఏలు అందించడంతోపాటు 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, న్యాయబద్ధమైన బకాయిలను, దాచుకున్న సొమ్మును మాత్రమే అడుగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, నాయకులు చంద్రమౌళి, హరికృష్ణాచారి, రమేష్, వెంకన్న, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ అన్నారు. స్థానిక కిరాణ వర్తక సంఘం భవనంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్ ఆధ్వర్యంలో మంగళవారం పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి డోలి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జె.బాను ప్రకాష్ రాధిక దంపతుల ఆర్థిక సహకారంతో సరుకులను పంపిణీ చేశామన్నారు.

వర్గీకరణ చట్టాన్ని అమలు చేయాలి

మహబూబాబాద్: ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించి, అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య.. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీమానాయక్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరస్వామి డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరాయి. కార్యక్రమంలో నాయకులు రమేష్, రజియా, రేణుక, భిక్షపతి, నవీన్, మంగిలాల్, వినోద్‌రెడ్డి, పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ స్టేషన్ తనిఖీ

డోర్నకల్: స్థానిక రైల్వే స్టేషన్‌లోని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఖాజీపేట ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆర్.సుభాష్ తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఏఎస్‌సీకు స్థానిక సిబ్బంది ఘనస్వాగతం పలికారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి కేసు వివరాల గురించి చర్చించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై వై.నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలకు ఆటంకం కలిగించొద్దు

తొర్రూరు: ఆరోగ్య సేవలకు ఆటంకం కలిగించవద్దని తొర్రూరు ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ భవన సముదాయంలో కొనసాగుతున్న హెల్త్ సెంటర్‌ను శాఖ అధికారులు ఖాళీ చేయమనడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆరోగ్య సిబ్బంది కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి.శ్రీలత, ఆరోగ్య సిబ్బంది రేణుక, శ్రీలత పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా అందించాలి

నెల్లికుదురు: అన్నిరకాల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా అందించాలని భవణ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో మంగళవారం ఈనెల20న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద జరిగే తెలంగాణ బిల్డింగ్ అండ్ ఆదార్ కనెక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు.

ఘనంగా పోషణ మేళా

కురవి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఐటీసీ సహకారంతో స్మార్ట్ ఆశీర్వాద్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోషణ మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం ఉప్పలయ్య మాట్లాడుతూ.. అయోడిన్ డిఫిసెన్సీ రక్తహీనత అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, జలగం కవిత పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

మహబూబాబాద్ రూరల్: ఎస్ఎఫ్ఐ నూతన సంవత్సర డైరీని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గంధసిరి జ్యోతిబసు, పట్ల మధు, రాకేష్ పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది వేతనాలు విడుదల చేయాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

మహబూబాబాద్: జీపీ సిబ్బంది మూడు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశాడు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ.. జీపీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60వేల జీపీ సిబ్బంది వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే విడుదల చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బీకు, రాములు, శ్రీహరి, వెంకన్న, భిక్షపతి, సురేష్ పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యకు మోదీ విధానాలే కారణం

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమంతరావు



మాట్లాడుతున్న హేమంతరావు

బయ్యారం: దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న రైతుల ఆత్మహత్యలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలే కారణమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం జిల్లా 3వ మహాసభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్పొరేట్‌శక్తుల ప్రయోజనాల కోసం రైతుల జీవితాలను ఇబ్బందులకు గురి చేయడం పాలకులు మానుకోవాలన్నారు. దేశంలోని రైతుల ఆత్మహత్యలకు మోదీ విధానాలే కారణం అవుతున్నాయన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతు సంఘం పోరాడుతుందని, త్వరలో నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి, నాయకులు అజయ్‌సారథి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వీరన్న పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సత్యవతి

గార్ల: రాష్ట్ర బడ్జెట్‌లో పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, ముల్కనూరు సమీపంలో మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మార్చిలో జరిగే బడ్జెట్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించి హైలెవెల్ బ్రిడ్జి, మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నిధుల మంజూరు విషయంపై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లాలన్నారు. శ్రీరాంసాగర్ కెనాల్ నీటిని విడుదల చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, అంబటి వీరస్వామి, పెద్దవెంకటేశ్వర్లు, ఇమ్మడి గోవింద్, నాగమణి, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలి



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

మహబూబాబాద్: అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఐసీడీఎస్ రంగానికి నిధులు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకుల రాజు, కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట 48గంటల ధర్నా నిర్వహించారు. దానిలో భాగంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి సంపూర్ణ, స్నేహ బిందు, నాయకులు నాగన్న, రాజమౌళి, శ్రీశైలం, వీరన్న, తిరుపతమ్మ, స్వరూప, నీలా పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

నెహ్రూసెంటర్: విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జనగాం నరేష్ మంగళవారం తెలిపారు. భద్రతపై ఉద్యోగులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఉద్యోగులకు క్షేత్రస్థాయిలో అవగాహన చేపడతున్నామన్నారు. అనుమతి కలిగిన అధికారి జాగ్రత్తలను పాటిస్తూ లైన్ క్లియర్ ఇవ్వాలన్నారు.

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి

జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఆటాపాటలతో అందరిని అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎంలు మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రణాళిక బద్ధంగా చదివి 10 జీపీఏ సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలకు అనుగుణంగా ఇష్టమైన రంగాలను ఎంచుకుని రాణించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: మాధవాపురం ఉన్నత పాఠశాలలో..



చిన్నగూడూరు: వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



గూడూరు: ఎస్టీ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో..



కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



పెద్దవంగర: చిట్యాల పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ గణేశ్



డోర్నకల్: చిలుకోడు పాఠశాలలో వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

మరమ్మతులు చేపట్టాలి

నెల్లికుదురు: తెగిపోయిన ఆలేరు చెరువు కట్టకు మరమ్మత్తులు చేపట్టి వచ్చే వర్షాకాలం పంటలకు నీరందించే విధంగా చర్య తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఆలేరు గ్రామంలో భారీ వర్షాలకు తెగిపోయిన చెరువు కట్ట వద్ద మంగళవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీను, మల్లయ్య, నర్సయ్య, రామయ్య పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం

దంతాలపల్లి: టీబీ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ప్రజా వైద్యశాల వైద్యుడు చైతన్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బీమా, సుజాత, టీబీ నోడల్ పర్సన్ చలపతిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు మంగళవారం తెలిపారు. ఐతె మురళీ, బానోతు నర్సింహా, సైదులు, యాకయ్య, ఎండీ యాకూబ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి శివారు ఆకేరువాగు నుంచి రెండు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. కస్నాతండాకు చెందిన తెల్లబోయిన రాంబాబు, అవిరేని లక్ష్మణ్‌కు చెందిన ట్రాక్టర్లను ఇసుకతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు.

వంట పాత్రల పంపిణీ

డోర్నకల్: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం వండేందుకు వినియోగించే పాత్రలను ఎంఈఓ లక్ష్మా నాయక్ హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు.

వెలికట్టలో ముగిసిన క్రికెట్ పోటీలు

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామంలో యువజన సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. అనంతరం విజేత అయిన చిట్యాల టీమ్ క్రీడాకారులకు రూ.30వేల నగదు, ద్వితీయ స్థానం వెలికట్ట గ్రామ టీమ్ క్రీడాకారులకు రూ.20వేల నగదుతోపాటు బహుమతిని అందించారు. కార్యక్రమంలో దాతలు అల్లంనేని అనిల్ రావు, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, తూనం శ్రావణ్, చకిలేల మణిరాజ్, దీకొండ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గిరిజ, పద్మావతి, సంజీవ, రమేష్, రంజాన్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా చిరంజీవి



దంతాలపల్లి: ఇటీవల టీజీపీఎస్సీ విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన ధర్మారపు చిరంజీవి కొలువు సాధించాడు.

ఎస్సారెస్పీ జలాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర: ఎస్సారెస్పీ జలాలను వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని వరి పంటలను ఏఓ స్వామి నాయక్‌తో కలిసి సందర్శించారు. ఆర్ఐ లస్కర్, ఏఈఓ రాజు, రైతులు పాల్గొన్నారు.

పది పరీక్షల సెంటర్ల పరిశీలన

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల సెంటర్లను మంగళవారం తహసీల్దార్ కోడిచింతల రాజు హెచ్‌ఎంతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రెహమాన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నెహ్రూసెంటర్: ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కార్యదర్శి కందాల రంగయ్య అన్నారు. ఈ నెల 24వరకు జరిగే వర్ధంతి సభలను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, బిచ్యా, కార్తీర్, యాకయ్య, రాజు, పాష, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా..

దంతాలపల్లి: మండలంలో సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ పల్టీ కొట్టిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. సూర్యాపేట జిల్లా మేళ్లచేరువు నుంచి నిజామబాద్, ఆర్మూర్‌కు లారీ 700 వందల బస్తాల సిమెంట్ లోడుతో వెళ్తోంది. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామ సమీపంలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలో పడిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నుంచి వరంగల్ వైపు అక్రమంగా తరలిస్తున్న 18టన్నులు, సుమారు రూ.4.50లక్షల విలువైనా రేషన్ బియ్యాన్ని, లారీని సీజ్ చేసి సంబంధిత సివిల్ సప్లయి అధికారులకు అప్పగించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ బొప్పిడి అరుణాకుమార్‌ను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మరిపెడ రూరల్: విద్యుదాఘాతంలో ప్రైవేట్ యువ ఎలక్ట్రిషియన్ మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్లంపేటలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎల్లంపేట గ్రామానికి చెందిన బత్తెం శ్రీను, కళమ్మ దంపతుల పెద్దకుమారుడు అజయ్ (21) గ్రామంలో ప్రైవేట్ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఎల్లమ్మ పండుగ జరుపుకుంటున్నారు. రాత్రి సమయంలో ఇంట్లోనే విద్యుత్ సమస్య రావడంతో సరి చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హుటాహుటిన మండల కేంద్రానికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భూమి ఇస్తానని నమ్మించి మోసం

మహబూబాబాద్ రూరల్: భూమి ఇస్తానని నమ్మించి రూ.14.25 లక్షలకు టోకరా పెట్టిన వ్యక్తిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని రామచంద్రపురం కాలనీలో నివాసం ఉండే గొడుగు శ్రీనివాస్ అనే వ్యక్తి శ్రీపాద అరుణ్‌కుమార్ అనే వ్యక్తికి గుమ్ముడూరు రెవెన్యూ సర్వేనంబర్ 557, 558 పరిధిలో 5గుంటల భూమి విక్రయానికి ఉందని చెప్పాడు. అది నిజమని నమ్మిన బాధితుడు 2022 సంవత్సరంలో రూ.18లక్షలకు భూమి కొనుగోలు చేసే విధంగా గొడుగు శ్రీనివాస్‌తో ఒప్పందం చేసుకున్నాడు. అదే సమయంలో అరుణ్ కుమార్ రూ.14.25 లక్షల నగదును శ్రీనివాస్కు చెల్లించాడు. ఏళ్ల తరబడి తిరుగుతున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి భూమి ఇవ్వకపోవడంతో అరుణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై అలీమ్ హుస్సేన్ కేసు నమోదు చేశారన్నారు.

కత్తితో దాడి.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: పాత కక్షల కారణంగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఘటనలో ఓ వర్గానికి చెందిన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా, మరో వర్గానికి చెందిన ముగ్గురిపై దాడి కేసు నమోదైన సంఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీరాం భద్రన్న కాలనీలో నివాసం ఉండే సూనావత్ వంశీ, పిడుగు శ్రీనుకు మధ్య పాత కక్షలు ఉన్నాయి. కాలనీలో ఇరువర్గాలు ఘర్షణపడగా జరిగిన ఘటనపై వంశీ పోలీసులకు ఫిర్యాదు చేద్దామని తహసీల్దార్ కార్యాలయ సెంటర్ వద్దకు రాగా అతడిపై పిడుగు శ్రీను, బంధువు ప్రణయ్ ఇద్దరు కలిసి కత్తితో దాడిచేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడు వంశీ ఫిర్యాదు చేయగా శ్రీను, ప్రణయ్ పై టౌన్ ఎస్సై కె.శివ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారన్నారు. అదే విధంగా పిడుగు శ్రీను తనను సునావత్ వంశీ అతడి సోదరులు మధు, ప్రవీణ్ తిడుతూ దాడిచేసి కొట్టారని ఫిర్యాదు చేయగా సదరు ముగ్గురు వ్యక్తులపై దాడికేసు నమోదు చేశామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మహబూబాబాద్ రూరల్: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్/నర్సింహులపేట/మరిపెడ /డోర్నకల్: బీసీ బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శంతన్ రామరాజు అన్నారు. బీసీ బిల్లు (42 శాతం) ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కాల్చారు. కార్యక్రమంలో నాయకులు కదిరె సురేందర్, మాదరబోయిన యాకన్న, మహ్మద్ నాసర్, గుగులోత్ రాములునాయక్, రామరాజు ప్రవీణ్, ఆనంతుల రాజమ్మ పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఇల్లెందు: తల్లిదండ్రుల నుంచి ప్రాణహానీ ఉన్నందున రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట పోలీసులు, న్యాయస్థానాన్ని మంగళవారం ఆశ్రయించింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వలకు చెందిన కందిపాటి తరుణ్, అదే ప్రాంతంలోని క్యాంపుతండాకు చెందిన ధరావత్ మమత భద్రాద్రి జిల్లా ఇల్లెందులోని చెరువుకట్ట పెద్దమ్మ తల్లి ఆలయంలో కులాంతర వివాహం చేసుకున్నారు. అయితే, మమత తల్లిదండ్రులు వీరి పెళ్లిని అంగీకరించక పోలీసులకు ఫిర్యాదు చేశారని, అంతేకాక దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ప్రేమజంట వాపోయింది. ఇల్లెందులపాడుకు చెందిన సిద్దంకి వెంకన్న(వరుడి తాత) ఇంటి వద్ద ఉండి జీవనోపాధి చూసుకోవాలని నిర్ణయించుకున్నందున తమకు రక్షణ కల్పించాలని కోరగా ఫిర్యాదును పరిశీలించిన న్యాయమూర్తి తగుచర్యలు తీసుకోవాలని ఇల్లెందు డీఎస్పీని ఆదేశించారు. దీంతో సీఐ బత్తుల సత్యనారాయణ విచారణ చేపట్టారు.